Main-I(MDK):Main-I(MDK).qxd 12/20/2022 10:02 PM Page 1





మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

### ఉపాధి కోసం దుబాయి వెళ్లి
## అనారోగ్యంతో చిన్నగుండవెల్లి వాసి మృతి

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** జీవనోపాధికోసం దుబాయి వెళ్లిన వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ అసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం చిన్నగు ండవెల్లిలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి అదే గ్రామానికి చెందిన కె.నర్సింలు(48) ఉపాధి కోసం 5 యేండ్ల క్రితం దుబాయికి వెళ్లాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ అసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సింలు సోమవారం రాత్రి మృతి చెందినట్లు సహ ఉద్యోగులు సమాచారం అందించడంతో కుటుంబీకులు దుఖంలో మునిగిపోయారు. మృతునికి భార్య, ఇద్దరూ కుమార్తెలు ఉన్నారు. కొడుకు 10 యేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నర్సింలు మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బాధిత నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా

**హుస్నాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** పేద బడుగు బలహీన వర్గాలపై పాలకులు చిన్న చూపు చూస్తున్నారంటూ నేడు(బుధవారం) తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ ప్రకటించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. పోరాటాల ద్వారా పాలకు కళ్ళు తెరిపించేందుకు దళితబంధు రాని వారితో పాటు వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగులు, బీడి, గీత, నేత కార్మికులు, ఆసరా పథకం, సాధిం చేందుకుగాను పోరు చేసేందుకు కలిసి రావాలని సిపిఐ నాయకులు గడిపె మల్లేష్ పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, అసంపూర్తిగా మిగిలిపోయిన ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించాలనే తలంపుతో పోరు సాగిస్తామని అర్హులైన వారికి రేషన్‌కార్డులు సవరణలు మార్పులు చేయాల్సినఅవసరం ఉందన్నారు. దీంతోపాటు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వార కూలీలకు పనులు కల్పించేలా పోరుచేసి హక్కులను సాధించుకోవాలని మల్లేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హుస్నాబాద్ తహసీల్ కార్యాలయం ఎదుటకు పేదలు తరలిరావాలని మల్లేష్ పిలుపునిచ్చారు.



విద్యార్థులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

## తొలిమెట్టుతో విద్యార్థుల్లో సామర్థ్యాల పట్టు

**-అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

**పాపన్నపేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను ఆర్జిస్తున్న ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. మంగళవారం డిఇఓ రమేష్‌తో కలిసి మండలంలోని పొడిచెన్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమం అమలుపై ఆరా తీశారు. విద్యార్థుల చేత నల్లబల్లపై పదాలను రాయించారు. పాఠ్యాంశాలను చదివించారు. ప్రతి ఒక్కరూ రాయటం, చదవటం చేయాలని సూచించారు. మన ఊరు మన బడి పథకంలో కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి సుభాష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్తులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సాహిత్య పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులుఅందజేసిన దృశ్యం

**మర్కుక్, డిసెంబర్ 20 (ప్రభాతవార్త):** విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి పాఠశాల స్థాయిలో కథల పోటీలను చిమ్మపూడి ఫౌండేషన్ నిర్వహించడం సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి అన్నారు. మండలకేంద్రం మర్కుక్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 65 మంది విద్యార్థిని, విద్యార్థులకు సాహిత్య కథల పోటీలు నిర్వహించారు.అందులో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి 6వ తరగతి విద్యార్థిని ఎస్.సాక్షిత, ద్వితీయ బహుమతి ఈ.వర్ష, సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి 9వ తరగతి విద్యార్థిని గుంటి మనూష, ద్వితీయ బహుమతి ఎస్.ప్రణయ్‌గౌడ్‌లు గెలుపొందగా ఆరుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా చిమ్మపూడి సాహిత్య ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, సిద్దయ్యలు మాట్లాడుతూ విద్యార్థులకు ఏర్పాటుచేసిన పరీక్షల్లో చక్కగా కథలు రాసి వినిపించడం బాగుందని, భవిష్యత్తులో విద్యార్థులకు ఇలాంటిపోటీలు ఎంతో ఉపయోగపడతాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో పద్మారెడ్డి, నరహరి, ప్రసాద్, నాగేశ్వర్‌రావు, విద్యాధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, లావణ్య, సంతోష, రజిని, రమాకాంత్, భ్రమరాంభ, మునీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

**-రివ్యూ సమావేశంలో పోలీసులతో జిల్లా కలెక్టర్**



సమావేశంలో సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ శరత్

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** శాంతి భద్రతల స్థాపనకు సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ప్రతి పోలీసు అధికారిపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ శరత్ సూచించారు. మంగళవారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారి క్రైమ్ రివ్యూ సమావేశం జిల్లా ఎస్పీ ఎం.రమణకుమార్ ఆధ్వర్యంలో కొనసాగింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పోలీసులు అందిస్తున్న సేవలను కొనియాడారు. నేరాలను శోధించడంలో పోలీసులు చూపుతున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. వ్యవస్తీకృత నేరాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను సైతం అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలు, ప్రభుత్వం నిషేదించిన మత్తుపదార్థాల సాగు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ రమణకుమార్ ఆయా పోలీసు ఠాణాల్లో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల వివరాలను పరిశీలించారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో కేసులను చేధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రమణకుమార్ వివరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజాప్రతినిధులను, ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహ్మద్ అశ్వాక్, సంగారెడ్డి, పటాన్‌చెరువు, జహీరాబాద్, నారాయణఖేడ్ డిఎస్‌పిలు రవీంద్రారెడ్డి, భీమ్‌రెడ్డి, రఘు, బాలాజీ, ఆయా ఠాణాల సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రజలే పరమావధిగా పనిచేయాలి

**రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు**

**దుబ్బాక, డిసెంబర్ 20, ప్రభాతవార్త:**

ప్రజలే పరమావధిగా పనిచేయాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండి పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఇటీవలే నూతనంగా ఎన్నికైన దుబ్బాక మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతల జ్యోతికృష్ణ, వైస్ ఛైర్మన్ చెక్కపల్లి పద్మయ్యలతో పాటుగా పాలకవర్గానికి అలాగే నూతన మండలమైన అక్బర్‌పేటభూంపల్లి మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రవిలు కలసి మంత్రి హరీష్ రావు, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్‌లను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, పార్టీ ప్రతిష్ట కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మండల బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బానాల శ్రీనివాస్, మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మమద్ ఖాలీల్, నాయకులు బక్కి వెంకటయ్య, భూంరెడ్డి, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

# నా ఇజ్జత్ ఉంచుతారా..పోగొడతారా...

- హుస్నాబాద్‌లో డయాలసిస్ కేంద్రం ప్రారంభం చేసిన మరునాడే తాళం
- 48 గంటల్లో తిరిగి ప్రారంభించాలని వైద్యాధికారులకు మంత్రి ఆదేశం
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి హరీష్‌రావు



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

నా ఇజ్జత్ ఉంచుతారా.. పోగొడుతారా.. హుస్నాబాద్‌లో డయాలసిస్‌కేంద్రం ప్రారంభం చేసిన మరునాడే తాళం వేయడంపై రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు సంబంధితశాఖ అధికారులపై తీవ్ర అగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం జిల్లా పరిషత్ అధ్యక్షురాలు వేలేటీ రోజాశర్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హుస్నాబాద్ డయాలసిస్ కేంద్రంలో రూ.కోటి సకల సౌకర్యాలు కల్పించి ప్రారంభం చేస్తే ప్రారంభించిన మరుసటి రోజే తాళం వేయడం ఏమిటని ప్రశ్నించారు. 48 గంటల్లో సమస్య పరిష్కరం చేసి అసుపత్రిలో డయాలసిస్ కేంద్రం తిరిగి ప్రారంభం చేయాలని వైద్యాధికారులను అదేశించారు. పేదవారు ప్రైవేటు అసుపత్రులకు వెళ్లకుండా చూడాలన్నారు.జిల్లాలో ఎక్కడా ఎఎన్ఎం సబ్ సెంటర్ లేని గ్రామం ఉండొద్దన్నారు. గ్రామంలో ఎఎన్ఎం సెంటర్‌కు భవనం లేకుంటే భూమి ఇస్తే వెంటనే నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ అసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. స్కానింగ్ కోసం గర్భిణీలను ఇతరులను ప్రైవేటు అసుపత్రులకుపంపొద్దన్నారు.జిల్లాలో త్వరలో 92 పల్లె దవాఖానాలు ప్రారంభి స్తామన్నారు. అలాగే 18 నుంచి కంటి వెలుగు ప్రారంభించడం జరుగుతుందన్నారు.ప్రతి పిహెచ్‌సిలో పాము, కుక్క కాటుకు టీకాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పేదలకు వైద్య సేవలు అందించడంలో ఏ మాత్రం నిర్లక్ష్యంచేసిన సహించేదిలేదన్నారు. రాష్ట్రంలో నిర్మించిన రైతు కల్లాలపై కేంద్ర ప్రభుత్వం కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్లు కయ్యం పెడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఈజీఎస్ కింద నిర్మించిన రైతు కల్లాల డబ్బులు రూ.150 కోట్లు తిరిగి వెనక్కి ఇవ్వాలని మొండికే స్తుందన్నారు. గజ్వేల్ రేక్ పాయింట్‌లో ఉన్న దృష్ట్యా ఎరువుల విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎరువులు దొరకక లైన్ లో నిలబడి 7 మంది రైతులు చనిపోయారని అవే దన వ్యక్తం చేశారు. గతఏడాది సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానం లో నిలిచిందని ఈ ఏడుకూడా అదే తరహాలో నిలువాలన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద నూతనంగా నిర్మించిన వంద పాఠశాలలను జనవరి 2 వ తేదీన ప్రారంభించడానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులపై మంత్రి ఆరా తీసి కొంత అసం తృప్తి వ్యక్తం చేశారు. మన ఊరు మన బడి పథకంకు నిధుల కొరత లేదన్నారు. అయిల్‌ఫామ్ తోటల సాగుపై అధికారుల ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లాకు అర్‌అండ్‌బి ఎస్ఈ, పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయాలు మంజూరు కానున్నాయన్నారు. ఎస్ఈ అర్‌అండ్‌బి కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పిఆర్ ఎస్ఈ కార్యాలయానికి సైతం త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు వస్తాయన్నారు. వైస్ చైర్మన్ రాజారెడ్డి, కోహెడ, గజ్వేల్, వర్గల్, చేర్యాల, మద్దురు, కొమురవెల్లి తదితర మండలాలకు చెందిన ఎంపిపిలు, జడ్పీటిసిలు ప్రధానంగా పాఠశాలలు, వైద్యాశాఖ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్,ఎమ్మెల్యే రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్, వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సిద్దిపేట రైల్వే కలను సాకారంచేసిన సిఎం కెసిఆర్

**రైల్వే లైన్‌తో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి**
**ఏప్రిల్‌లో సిద్దిపేటకూ రైలు కూత మోగాలి**
**మంత్రి హరీష్‌రావు**



రైల్వే నిర్మాణం పనులు పరిశీలిస్తున్న మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేటకు రైల్వే ఏర్పాటు దశాబ్దాల కల.. ఆ కలను సిఎం కెసిఆర్ సాకారం చేశారని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. మార్చిలో నెలలో దుద్దెడకు రైలు వస్తుందని ఏప్రిల్, మే నెలలోగా సిద్దిపేటకు రైలు వచ్చేలా వేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు.మంగళవారం సిద్దిపేట రైల్వే స్టేషన్ నుంచి నిర్మాణంలో ఉన్న దుద్దెడ రైల్వే స్టేషన్ వరకు జరుగుతున్న రైల్వే ట్రాక్ లైన్‌పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఫేస్-1 ద్వారా హైదారాబాద్ నుంచి మనోహరాబాద్ మీదుగా గజ్వేల్ వరకు 44 కిలోమీటర్ల రైలు సేవలె ప్రారంభమై రాకపోకలుసాగుతున్నాయన్నారు. రైల్వే రేక్ పాయింట్ ఏర్పాటు చేసి ఎరువులు తీసుకవచ్చి జిల్లాలోని అన్ని ప్రాంతాల రైతులకు ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు.ఎరువులను తీసుకరావడానికి సనత్‌నగర్ రేక్ పాయింట్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పేజ్-2 ద్వారా గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఫేజ్-3 ద్వారా సిద్దిపేట నుంచి సిరిసిల్ల, ఫేజ్-4 ద్వారా సిరిసిల్ల నుంచి వేములవాడ మీదుగా కరీంనగర్ వరకు రైల్వే లైన్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు రైల్వే లైన్ పనుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. రైల్వే లైన్ పనుల నిర్మాణంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. రైల్వే లైన్ భూ సేకరణ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైల్వే లైన్ పనులు వేగం చేయడానికి రూ. వంద కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. రైల్వే లైన్ పూర్తి అయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్‌లో ఈ లైన్ ఉత్తర దక్షిణాదిని ముఖ్యమైన రైల్వే మార్గంగా మారుతుందన్నారు.

మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, రైల్వేశాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సంతోష్‌కుమార్, అధికారులు సోమరాజు, జనార్దన్‌బాబు, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఈ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## డాక్టరేట్ అందుకున్న దశరథ్‌కు ఘన సన్మానం

సంగారెడ్డి డిసెంబర్ 20, ప్రభాతవార్త: విద్యా, సామాజిక సేవలకు గానూ ఆసియా వేధిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారి నుండి "ఉత్తమ డాక్టరేట్ అవార్డ్" ను బెంగళూర్‌లో అందుకోవడం జరిగింది. అందుకు గాను మునిపల్లి మండల విద్యాధికారి చిత్తారి దశరథ్ కు వోక్సన్ యూన్సివర్సిటీ ప్రాంగణంలో టిపిటిఎఫ్ మునిపల్లి టీం పక్షాన శాలువకప్పి మంగళవారం నాడు ఘనంగా సత్కరించడం జరిగింది. కాగా టిపిటిఎఫ్ మునిపల్లి టీం పక్షాన ఎంఈఓ దశరథ్ కు మరొక సారి అభినందనలు తెలిపారు. ఇంకా మరెన్నో అవార్డ్‌లను ఎంఈఓ అందుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు లక్ష్మణ్, గోపాల్, సంతోషమ్మ, సంగమని, అనురాధ, విష్ణు గౌడ్, ప్రవీణ్ కుమార్, అమినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి ఇంటి ముందు బైటాయించిన ఉపాధ్యాయుడు

### పది రోజుల నుంచి బడికి రావడం లేదని
## విద్యార్థి ఇంటి ముందు బైటాయించిన ఉపాధ్యాయుడు

**బెజ్జంకి, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** పది రోజుల నుంచి విద్యార్థి పాఠశాలకు రావడం లేదని ఉపాధ్యాయుడు విద్యార్థి ఇంటి ముందు బైటాయించిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన జేరిపోతుల నవీన్ స్థానిక బాలుర ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతుండగా పది రోజుల నుంచి పాఠశాలకు రాకపోవడంతో మంగళవారం ఉపాధ్యాయుడు ప్రవీణ్ విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థిని బడికి పంపించేదాక ఇంటి ముందు నుంచి లేవనని బైటాయించడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయుడి వెంటనే విద్యార్థిని పాఠశాల పంపించారు. ఈ విషయం తెలిసిన మండల వాసులు విద్యార్థి భవిష్యత్ కోసం అలోచించిన ఉపాధ్యాయుడిని అభినందించారు. ఉపాధ్యాయుడు ప్రవీణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్ దృష్టిసారించాలన్నారు.

బుధేరాలో బలవంతపు భూసేకరణ ఆపాలి

## 2013 చట్టం ప్రకారం భూసేకరణ చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్**



రైతులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్

**సంగారెడ్డి, డిసెంబర్ 20,ప్రభాతవార్త:** సంగారెడ్డిజిల్లాలో బలవంతపు భూసేకరణ వెంటనే ఆపాలని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మునిపల్లి మండలం బుధేరా గ్రామంలో భూములు పోతున్న రైతులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధేరాలో బలవంతపూ భూసేకరణ వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేయాలని అన్నారు. రెవెన్యూ అధికారులు చట్టాలను అతిక్రమించి రైతులను భయపెట్టి సంతకాలు తీసుకోవటం అన్యాయం అన్నారు. రైతులను భయపెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2013 భూసేకరణ చట్టప్రకారం ప్రస్తుత మార్కెట్‌రేటుకు మూడింతలు అందనంగా నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి సున్నంపెట్టే ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరిమించుకోవాలని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా భూసేకరణ చేయడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యాదవరెడ్డి, రైతులు దశరథ్ యాదవ్, నాగయ్య, గోపాల్‌రెడ్డి, మల్లయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యం దిశగా అడుగులు వేయాలి : ఎమ్మెల్యే

**దుబ్బాక, డిసెంబర్ 20, ప్రభాతవార్త:**

నాలుగు సంవత్సరాల కల నెరవేరిన సంధర్భంగా దుబ్బాక ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునంధన్ రావు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో పాటుగా మార్నింగ్ ప్రేయర్‌లో ఎమ్మెల్యే రఘునంధన్ రావు పాల్గొన్నారు. పాఠశాల సిబ్బంది కోరిక మేరకు విద్యుత్ వాటర్ ఫిల్టర్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. త్వరలో మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, వచ్చే సరికి పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో శ్రమదానం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభుదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజుల రాంచంద్రం, పాఠశాల సిబ్బంది, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమి

**భూస్వాములకు దారులుగా మారుతున్న వైనం**
**తమ అవసరాలకు మలుచుకుంటున్న వ్యాపారులు**
**చోద్యం చూస్తున్న అధికారులు**



ప్రభుత్వభూమిలో నుండి వేసిన రోడ్డు



వార్త కథనానికి స్పందించి భూమీ సర్వేచేస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

**సంగారెడ్డి, డిసెంబరు 20, ప్రభాతవార్త:**

అక్రమ మార్గంలో భూదందా చేసేవారికి ప్రభుత్వ భూములు వరంగా మారుతున్నాయి. తమ వ్యవసాయ భూములు అమ్మకానికి అవసరమైన, అనువైన రవాణా అవకాశాలు లేకపోవడంతో, దానికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూములు వారికి, వరంగా మారుతున్నాయనే ఆరోపణలున్నాయి.. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం, వ్యవసాయ భూములకు అనుకూలమైన ధరలు రావలంటే, రోడ్డు సౌకర్యం ముఖ్యం.. రోడ్డుసౌకర్యం ఉన్న వ్యవసాయ భూములకే డిమాండ్ ఉంది. నీటి వనరులు ఉన్న, అనుకూలమైన వీస్తీర్ణం ఉన్నప్పటికి రోడ్డ సౌకర్యం లేకపోతే అనుకున్న ధర రావడం కష్టం మారింది. దీనికి కొందరు సులువైన మార్గంను అనుసరిస్తున్నారు. పట్టాభూములకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో దాని పక్కనేఉన్న ప్రభుత్వ భూములపై కన్నుపడిన కొందరు, ప్రభుత్వ భూములను తమకు అనుకూలంగా పలుచుకునేందుకు, అక్రమమార్గంలో ప్రభుత్వ భూములను, స్వాధీనం చేసుకోవడానికి ప్రణాళికలు రుపొందించి ఆమలు చేస్తున్నారనే విమర్శలున్నాయి.. ఫలితంగా ప్రభుత్వ భూములు బడా భూస్వాముల వశం అవుతున్నాయి. ప్రభుత్వభూమీ రూపు రేఖలు మారిపోయి. వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడాల్సిన వ్యవసాయభూమీ, రోడ్డుగా మారి, వాణిజ్య అవసరానికి ఉపయోగపడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.హత్నూర మండలం పరిధిలోని దేవులపల్లి గ్రామం పరిధిలోని 114 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా చేతులు మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేవులపల్లి గ్రామం పరిధిలోని 114 సర్వే నెంబర్‌లోని సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమిని, ప్రభుత్వం గతంలో కాసాల, హత్నూర గ్రామాలకు చెందిన కొందరు లబ్దిదారులకు భూమీని పంపిణి చేసిందని స్థానికులు తెలిపారు. భూపంపిణి ప్రారంభంలో లబ్దిదారులు ప్రభుత్వం పంపిణిచేసిన భూమిలో వ్యవసాయం సాగుచేశారని అన్నారు. అనంతరం వ్యవసాయానికి అవసరమైన సాగునీటి వసతులు తగ్గిపోవడంతో కొన్ని రోజుల కొంత భూమి భీడుగా ఉందని అన్నారు. ఇందులో కొందరు లబ్దిదారుల వద్దఉన్న భీడు భూములను తమవశం చేసుకునేందుకు,పథక రచనచేసిన బడా భూస్వాములు కొందరు, లబ్దిదారులకు కొంత నగదు రూపంలో చెల్లించి, ఒప్పంద పత్రాలు రాసుకొని, లబ్దిదారులకు ప్రభుత్వం పంపిణి చేసిన అసైన్డ్‌మెంట్ భూమీని తమస్వాధీనంలోనికి తీసుకున్నారని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ భూమిని తమ స్వాధీనంలోకి తీసుకున్న బడా భూస్వాములు, తమ పట్టాభూమీ నుండి ప్రధాన రోడ్డు వరకు అవసరమైన రోడ్డును, తమ పట్టా భూమితో పాటు, లబ్దిదారులనుండి కొనుగోలు చేసిన భూమని కలుపుతూ, ప్రధాన రోడ్డు వరకు రోడ్డు వేశారని స్థానికులు తెలిపారు.ఈప్రభుత్వ భూమీ అన్యాక్రాంతంపై గత సంవత్సరం మార్చినెలలో వార్త దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రెవెన్యూ అధికారులు గత సంవత్సరం మార్చి 31న, రెవెన్యూ అదికారులు, సర్వేయర్‌లు కలిసి భూమీని సర్వేచేశారు. ప్రభుత్వ భూమీ అన్యాక్రాంమైన విషయం గుర్తించారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని అప్పట్లో చెప్పినా, ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గోంగళీ అక్కడే అన్న చందంగా మారింది.ప్రభుత్వ భూమి నుండి రోడ్డు వేయడంతో ప్రధాన రహదారి నుండి వెళ్లడానికి అనుకూలంగా మారడంతో ధర ఏకంగా పెరిగిందని స్థానికులు తెలిపారు. హత్నూర మండలంలోని హత్నూర,దౌల్తాబాద్ గ్రామాల మధ్యగల ప్రధానరహదారి పక్కన 1గుంట భూమీ 10లక్షల వరకు పలుకుతుందని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగ్‌రోడ్డు కూడ ఈప్రభుత్వ భూమీకి అనుకొని వెళుతుండటంతో అక్కడ ఎప్పుడులేని విధంగా, భూములకు డిమాండ్ పెరిగిందని వారు తెలిపారు. దీనికి సమీపంలోనే ఉన్న ప్రభుత్వభూమీ, ప్రభుత్వ నిభంధనలకు విరుద్ధంగా ఇతరులు రోడ్డుకు వినియోగించుకుంటున్నప్పటికి సంబంధిత అధికారులలో చలనంలేకపోవడం వారి చిత్తశుద్ధికి నిధర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు.రీజినల్ రింగ్ రోడ్డు రానుండటంతో కోట్లరుపాయాల విలువగల ప్రభుత్వభూమీని సక్రమంగా వినియోగంఅయ్యేలా చర్యలు తీసుకోవాల్సి అధికారులు మౌనం వహించడంలో అంతర్యం ఏమిటిని స్థానికులు ప్రశ్నిస్తున్నానరు.



మంత్రి, ఎంపిని సన్మానం చేస్తున్న దృశ్యం

## మంత్రి, ఎంపిని సత్కరించిన ప్రజాప్రతినిధులు

**మిరుదొడ్డి, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మోతె, కాసులాబాద్, మల్లుపల్లి, వీరారెడ్డిపల్లి, బేగంపేట గ్రామాలకు ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించిన మంత్రి హరీష్‌రావు ఎంపి ప్రభాకర్‌రెడ్డిలను మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తుమ్మల బాలరాజు, కాలేరు శ్రీనివాస్, భారతి భూపతి, పన్యాల వెంకటరెడ్డి, ప్రతాప్, బక్కి వెంకటయ్య, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

## డ్రమ్ సీడర్ విత్తే విధానంపై అవగాహన



దామరకుంటలో డ్రమ్ సీడర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

**మర్కుక్, డిసెంబర్ 20 (ప్రభాతవార్త):** డ్రమ్ సీడర్ విధానంలో వరి విత్తనాలు విత్తడంతో అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో రైతు గణేష్ పొలంలో మంగళవారం డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలు విత్తడంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తే ఎకరానికి రూ.8వేలు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని సూచించారు. ఈ పద్దతిలో విత్తినప్పుడు ఒక చదరపు మీటరుకు ఉండవలసిన మొక్కల సంఖ్య ఉండడం వల్ల వరి దిగుబడి అధికంగా ఉండడంతో పాటు వర్షాలు ఆలస్యమైనా, సకాలంలో నీరు అందనప్పుడు కాలువల ద్వారా నీటి విడుదల ఆలస్యమైనప్పుడు ముదురు నార్లతో నాటు వేయడం జరుగుతుందని, దీనివల్ల వరిలో దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. అలాంటి పరిస్థితిలో డ్రమ్ సీడర్ పద్ధతి అనువుగా ఉంటుందని, కలుపు మరియు ఎరువుల యాజమాన్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గాయత్రిబాల్‌నర్సయ్య, ఉపసర్పంచ్ అంజయ్య, ఏఈఓలు అశ్విని, విష్ణువర్ధన్, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో ఎత్తివేత కుట్రలను భగ్నం చేస్తాం

### -వైఎస్సార్‌టిపి నాయకులు అయిలేని

**హుస్నాబాద్, డిసెంబరు 20,ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణ ఆర్టీసి డిపోను ఎత్తివేసే కుట్రను ప్రభుత్వం చేస్తోందని ఈ కుట్రలను భగ్నం చేస్తామని హుస్నాబాద్ పట్టణ నియోజకవర్గ వైఎస్సార్‌టిపి నాయకులు అయిలేని మల్లిఖార్జునరెడ్డి మండిపడ్డారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ ఆర్టీసి డిపోకు వెళ్ళి తాత్కాలిక డిపోమేనేజర్ అర్పితకు వినతిపత్రం సమర్పించి హుస్నాబాద్‌లోని అన్ని ప్రాంతాలకు సరైన వేళలకు బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బస్‌సర్వీసులను నడిపించకుండా డిపోను నష్టాల బాటలో నడిపించేలా సర్వీసులను రద్దు చేస్తూ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇలాగే హుస్నాబాద్ ప్రాంతం నుండి పుణ్యక్షేత్రాలకు బస్‌సౌకర్యం కల్పించాలని సూచించారు. హుస్నాబాద్ నుండి పుణ్యక్షేత్రాలైన వేముల వాడ, యాదగిరిగుట్ట, ధర్మపురి, కాళేశ్వరం, కొమురెల్లి తదితర పుణ్యక్షేత్రాలకు బస్‌లను నడిపించాలని,అంతే కాకుండా హుస్నాబాద్ డిపోకు పూర్తిస్థాయి డిపో మేనేజరును నియమించాలని అయిలేని మల్లిఖార్జునరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో గట్టు సాయి, బదుగుల రమేష్ ఉన్నారు.

## టి.సహకారశాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల నూతన కార్యవర్గం



టి.సహకారశాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల నూతన కార్యవర్గం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** టి.సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు మంగళవారం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టిఎన్జీవోల జిల్లా సహాధ్యక్షులు నిమ్మ సురేందర్‌రెడ్డి వ్యవహరించారు. సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా దారం ప్రవీణ్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న టిఎన్జీవోల జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కొమాండ్ల విక్రమ్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ సంఘం పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు ఏ కష్టం వచ్చిన సమస్యను జిల్లా ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేలా చూడాల న్నారు. ఎంత బాగా పని చేస్తు యూనియన్‌కు అంత గుర్తింపు వస్తుంద న్నారు. కార్యక్రమంలో టిఎన్జీవోల జిల్లా కోశాధికారి అశ్వక్ అహ్మద్, రూరల్ అధ్యక్షులు బాలరాజు, అర్బన్ కార్యదర్శి సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**కొమురవెల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముర్రి ముచ్చాల గ్రామానికి చెందిన జంగని రాజు అనారోగ్యంతో బాధపడుతుండడంతో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.47000 చెక్కును బిఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేష్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బిఆర్ఎస్ సర్కారు పేదల సంక్షేమానిక కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చదరపల్లి నర్సింగరావు, వొరుగంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హెచ్‌ఆర్‌సీ వైస్ ప్రెసిడెంట్‌గా రొండ మల్లారెడ్డి

**మెదక్, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పూడూరు గ్రామానికి చెందిన డాక్టర్ రొండ మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కొత్వాల్ దయానంద్ నేతృత్వంలో జాతీయ కౌన్సిల్ దక్షిణ భారత అధ్యక్షులు డాక్టర్ థామస్ చేతుల మీదుగా మల్లారెడ్డి నియామకపత్రం అందుకున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో ఆయన చేస్తున్న సేవలకుగాను గతంలో రొండ మల్లారెడ్డికి తమిళనాడు ప్రభుత్వం డాక్టరేట్ అవార్డు అందజేసిన విషయం తెలిసిందే. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి సేవాదృక్పథంతో సమాజ శ్రేయస్సు కోసం దశాబ్దాల కాలంగా తొడ్పడుతున్న రొండ మల్లారెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు ప్రముఖులు, పలువర్గాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రొండ మల్లారెడ్డి మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా నియమించడం గర్వంగా ఉందని, ప్రజల కష్టకాలంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చేపట్టిన సహాయ సహకారాలు ప్రజలకు న్యాయం చేకూర్చే అంశాలలో న్యాయబద్ధంగా మొటేషన్ ఇచ్చి వారి వద్ద ఉన్న డిమాండ్లను హెచ్‌ఆర్‌సీ నెరవేర్చే ప్రయత్నం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.



నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ రొండ మల్లారెడ్డి

# సిఎం కెసిఆర్ పాలనలో మల్లన్న క్షేత్రం అభివృద్ధి



మాట్లాడుతున్న అలయ పాలక మండలి చైర్మన్, సభ్యులు తదితరులు

**కొమురవెల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి వారి అలయ ప్రతిష్టకు కొందరు వ్యక్తులు కులాల ముసుగులో భంగం కలిగించేందుకు యత్నిస్తున్నారని దానిని వారు వెంటనే మానుకోవాలని అలయ అర్చకులు, ఒగ్గు పూజారులు, పాలక మండలి ప్రతినిధులు కోరారు.సీఎం కెసిఆర్ పాలనలో దేవాలయం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రత్యేక శ్రద్దతో భక్తులకు వసతులు, అలయంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అవుతున్నాయని తెలిపారు. మల్లన్న అలయంలోని పాలక మండలి కార్యాలయంలో మంగళవారం అలయ అర్చకులు, ఒగ్గు పూజారుల, ఆలయ పాలక మండలి చైర్మన్ గీసభిక్షపతి, ఏఈవో వైరాగ్యం అంజయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలయ స్థానాచార్యులు పడిగన్నగారి మల్లయ్య, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్‌లు మాట్లాడుతూ అలయంలో వీరశైవ అగమ శాస్త్ర ప్రకారం మార్గశిర మాసంలో కళ్యాణోత్సవాన్ని అలయ అర్చకులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహా శివరాత్రి రోజున పెద్ద పట్నం వద్ద స్వామి వారి కళ్యాణోత్సవానికి ఒగ్గు పూజారులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్వపు సంప్రదాయం మేరకు అలయంలో పూజలు కొనసాగుతున్నాయని స్వామి వారి ప్రతిష్టను, భక్తుల మనోభావాలకు భిన్నంగా ఇక్కడ పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు జరగడం లేదన్నారు.స్వామివారి కళ్యాణంలో బండారి వాడడం లేదని కొందరూ వ్యక్తులు స్వామి వారి కళ్యాణోత్సవం రోజున నిరసన వ్యక్తం చేయడం సరికాదన్నారు. అసలు స్వామి వారి చేతులో ఉండే బండారిని భక్తులకు ఇక్కడ బొట్టు పెడుతున్న విషయాన్ని వారు గమనించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులకు వసతులు చేకూరినట్లు తెలిపారు. ఒగ్గు పూజారుల సంఘం అధ్యక్షులు బొద్దుల కిష్టయ్య,బొద్దుల కనకయ్య, ఎక్కలదేవి శ్రీనివాస్, జింకల పర్వతాలు మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్నను అడ్డం పెట్టుకొని ఆలయానికి సంబధం లేని వ్యక్తులు కొందరూ లేనిపోని వివాదాలు సృష్టిస్తున్నారని ఆలయంలో ఎప్పుడు సంప్రదాయాలకు భిన్నంగా ఎలాంటి పూజలు, కార్య క్రమాలు జరుగలేదన్నారు. స్వామి వారి కళ్యాణోత్సం రోజున ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో బండారి చల్లుతూ ఊరేగింపు సైతం నిర్వహించినట్లు తెలిపారు. పూర్వపు సంప్రదాయం మేరకు స్వామివారి ఆలయంలోరోజువారి పూజలు, ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి, గోకులాష్టమి రోజున అలయ సంప్రదాయం మేరకు పెద్ద పట్నం వేసి స్వామి వారి కళ్యాణాన్ని తాము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలయానికి వచ్చే భక్తులకు సేవలు అందించడం వసతులు కల్పించడం కోసం ప్రత్యేక శ్రద్ద వహిస్తే బాగుటుందని కానీ అలయంలో సంప్రదాయాల పేరిట భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే ఒప్పుకోమన్నారు. సంప్రదాయాలు కొనసాగించడం లేదని మాట్లాడే అలయానికి సంబంధం లేని వ్యక్తులు తమ సమస్యలుంటే ఒగ్గు పూజారుల సంఘానికి వచ్చి కలువాలని కానీ తమ ఇష్టారాజ్యంగా నిరసన, అందోళనలు తమ మనోభావాలు దెబ్బతింటాయన్నారు. మంత్రి హరీష్‌రావు ప్రత్యేక శ్రద్ద,ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి కృషితో సిఎం కెసిఅర్ మల్లన్న క్షేత్రాభివృద్ధికి కోట్లాది రూపాయాలు మంజూరు చేయడంతో అలయం అభివృద్ధి చెందుతున్నట్లు వివరించారు. అలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, అలయ చైర్మన్ గీస బిక్షపతి తదితరులు మాట్లాడారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు కొంగర గిరిధర్,నామిరెడ్డి సౌజన్య, నూటిపల్లి బుచ్చిరెడ్డి, కందుకూరి సిద్దిలింగం,అలయ అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజ్ తదితరులు

## మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను అసభ్య పదజాలంతో దూషిస్తూ, విధి నిర్వహణలో మానసికంగా ఒత్తిడి తీసుకొస్తూ, సెలవు దినాల్లో ఆటంకాలు కలిగిస్తూ వికృతంగా కార్మికులపై వక్రబుద్ధి ప్రదర్శిస్తున్న మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ మహేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం మున్సిపల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌నాయకులు మాట్లాడుతూ అమాయకులైన కార్మికులపై అణచివేత, బల ప్రదర్శన చేస్తున్న అధికారుల వేధింపులు అరికట్టాలని మున్సిపల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. హెల్త్ అసిస్టెంట్ మహేష్‌పై చర్యలు తీసుకోని యెడల ఎమ్మార్పీఎస్, ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులపై వేధింపులు అరికట్టాలని, కార్మికులకు చట్టాలు రక్షణ కవచాలుగా అండగా ఉన్నాయని గుర్తుచేశారు. వివక్ష వైఖరిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు సకాలం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు, నాయకులు బాలరాజ్, సిద్ధిరాములు, సంపత్, సైదులు కుమార్, అనిల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## పంచాయతీ భవన నిర్మాణానికి కృషిచేసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునితారెడ్డి కృతజ్ఞతలు : సర్పంచ్



మాట్లాడుతున్న సర్పంచి మాధవి శ్రీశైలం

**కొల్చారం, డిసెంబర్20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామానికి నూతన గ్రామ పంచాయితీ భవనం నిర్మాణానికి రూ.20 లక్షల మంజూరు కృషి చేసిన నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డిలకు స్థానిక సర్పంచి శివప్పగారి మాధవి శ్రీశైలం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సర్పంచి మాధవి మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి సత్తమ్మ, వార్డు సభ్యులు విశ్వపతి, రవీందర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి హార్ట్ ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం అందజేత

**కొహెడ, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కూరెళ్ల గ్రామానికి చెందిన జాలిగం రాజు కూతురు జాలిగం చిట్టి మండల కేంద్రంలోని శ్రీఅదర్శ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పాపకు హార్ట్ అపరేషన్ ఉన్నందున్న రాజు ఆర్థికపరిస్థితి బాగ లేక పోవడంతో పాఠశాల కరస్పాండెంట్, విద్యార్థులు, తల్లిదండ్రులు తోచిన సహాయం చేయాలని కోరడంతో మంగళవారం రూ.32,400లను చిట్టి తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యశోద అంజయ్య, ప్రధానోపాధ్యాయులు శైలజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. చిట్టి హార్ట్ అపరేషన్ కోసం ఆర్థికసహాయం అందించిన పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందచేత

**మెదక్, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాధిక డయాగ్నోస్టిక్ సెంటర్ వైద్యులు శ్రీధర్ రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పోగుల రాజు,నరేష్‌గౌడ్, ఆకులరాజు, శ్రీమాన్ పాల్గొన్నారు.

## మాణెమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**నర్సాపూర్, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ సర్పంచ్ గుండె శివకుమార్ తల్లి మాణెమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం మాణెమ్మ మృతదేహాన్ని సందర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మృతిపట్ల, సర్పంచ్ గుండెశివకుమార్ కుటంబానికి వారు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ అంత్యక్రియల్లో జడ్పిటీసీ బాబ్యానాయక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు సర్పంచ్ జితేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగరావు, ఎంపిఓ శ్రీనివాస్, టిపిసిసి అదికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, పెద్దచింతకుంట ఉప సర్పంచ్ కదారి నాగరాజు, వివిద గ్రామాల సర్పంచ్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ గుండె శివకుమార్ తల్లి మాణెమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న పట్లోరి రాజు

## బిఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

**మెదక్, డిసెంబర్ 20,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పాలనలోనే తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని ఖాజాపూర్ తండా, చెన్నాయిపల్లి, సంగాయపల్లి, గవ్వలపల్లి, మాందాపూర్ తండా, రుద్రారం, సూరారం, భాగీర్తిపల్లి గ్రామాలలో నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.20లక్షల నిధులు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రులు, హరిష్‌రావు, దయాకర్ రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాదగిరి ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆపరేటర్లపై వేధింపులు ఆపాలి

**నర్సాపూర్, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** నర్సాపూర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌లపై వేధింపులు ఆపాలని టిఎస్‌యుఈఈయు సిఐటియు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఏడికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్దంగా విద్యుత్ సబ్ స్టేషన్ ఆపరేటర్‌ల చేత బలవంతంగా బిల్ రీడింగ్, కలెక్షన్‌లు చేయాలని ఏఈ, ఏడి, డిఈలు ఒత్తిడి తెస్తున్నారన్నారు. కార్మికులకు పని చెప్పడంలో ఉన్న శ్రద్ద సబ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో చూపాలన్నారు. సబ్ స్టేషన్‌లలో నాలుగవ ఆపరేటర్‌ను, ఇద్దరున్న చోట మరో ఇద్దరు ఆపరేటర్లను నియమించాలన్నారు. సబ్‌స్టేషన్‌ల ఆపరేటర్‌ల వేధింపులు ఆపాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27 న జిల్లా విద్యుత్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నాగరాజు, మల్లేష్, శ్రీకాంత్, గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ రాజర్షిషాతో కలిసి టిఎస్ఎంహెచ్ఐడిసి, నీటిపారుదల, మిషన్‌భగీరథ, పబ్లిక్ హెల్త్, ఇంజనీర్లతో ఆయా శాఖల ద్వారా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై నియోజకవర్గం వారీగా పనుల వారీగా సమీక్షించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి వివిధ భవనాల నిర్మాణం, ఆసుపత్రి భవనాల పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, ఆయా పనులను అగ్రిమెంట్ మేరకు నిర్ణీత సమయంలోగా పూర్తిచేయాలని టిఎస్ఎంహెచ్ఐడిసి ఈఈకి సూచించారు. పూర్తయిన భవనాలను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని, అదేవిధంగా ఇంకా ప్రారంభం కాని ఆయా పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టిలని సూచించారు. నీటిపారుదల శాఖకు సంబంధించి సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పంపు హౌస్‌లు, గ్రావిటీ కెనాల్, అప్రోచ్ కెనాల్స్‌కు భూసేకరణ, కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజ్ 19, కాలువల పునరుద్ధరణ, నల్లవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు, చెక్‌డ్యామ్స్ నిర్మాణాలు, కొత్తచెరువుల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ నీటిపారుదల శాఖ ఎస్ఈ మురళీధర్‌కు సూచించారు. అగ్రిమెంట్ తేదీనాటికి నిర్ణీతశాతంమేర పనులు పూర్తిచేయాలన్నారు. చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత నీటిపారుదల శాఖ అధికారులదని, జిల్లాలో ఏ విధమైన ఆక్రమణలు జరగకుండా చూడాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ శరత్ సూచించారు. జిల్లా ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా సాఫీగా సక్రమంగా జరిగేలా చూడాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రాజర్షి షా, నీటిపారుదల శాఖ ఎస్ఈ మురళీధర్, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, పబ్లిక్‌హెల్త్ ఈఈ నీటిపారుదల, మిషన్ భగీరథ ఈఈలు, టిఎస్ఎంహెచ్ఐడిసి ఈఈ తదితరులు పాల్గొన్నారు.

## భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) వేగవంతం చేయాలి

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** జిల్లాలో వివిధ పనులకు సంబంధించి భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత ఆర్‌డిఓలు, తాహసిల్దార్లకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి రెవిన్యూ డివిజనల్ అధికారులు, తాహసిల్దార్‌తో భూ సమీకరణ, హై వాల్యూ కాలనీస్, స్లే బిట్స్, జీవో 59 దరఖాస్తులు, ధరణి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమీకరణ వేగవంతంగా పూర్తిచేసేలా ఆయా తాహసిల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా సాఫీగా భూ సమీకరణ పూర్తికావాలని తెలిపారు. ధరణి దరఖాస్తులనున పరిష్కరించడంలో ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. బల్క్ ఇష్యూస్ ఉన్న గ్రామాలలో సుమోటోగా తీసుకొని ఆయా భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆయా భూ సమస్యలకు సంబంధించి అప్రైవల్ అయిన వారందరికీ హార్డ్ కాపీలను అందించేలా ప్రణాళిక చేయాలని తాహసిల్దారులక సూచించారు. తాహసిల్దార్లు ప్రజలకు సిస్టం మీద నమ్మకం కలిగించేలా పనిచేయాలని ఉద్బోధించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి, డిప్యూటీఐఓఎస్, సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి నగేష్, కలెక్టరేట్ ఏఓ మహిపాల్‌రెడ్డి, కంది, జిన్నారం, పటాన్‌చెరు, ఆర్సిపురం, సంగారెడ్డి, అమీన్పూర్, మునిపల్లి, కొండాపూర్, గుమ్మడిదల తాహసిల్దార్లు పాల్గొన్నారు.



జెడ్‌పిటిసి బాలుయాదవ్‌ను పరామర్శిస్తున్న మంత్రి హరీష్‌రావు

## జెడ్‌పిటిసిని పరామర్శించి మంత్రి హరీష్‌రావు

**వర్గల్, డిసెంబర్ 20 (ప్రభాతవార్త):** జెడ్‌పిటిసి బాలుయాదవ్ మాతృమూర్తి నర్సమ్మ మృతిచెందగా సోమవారం సాయంత్రం వారి కుటుంబాన్ని మంత్రి తన్నీరు హరీష్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపిపి లతారమేష్‌గౌడ్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఫారూక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు సంతోషవెంకటేష్, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు జాలిగామ వెంకటేష్‌గౌడ్, టిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఫోటోరైటప్:02. క్షేత్రపర్యటనలో విద్యార్థులు

## కేరళ స్కూల్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

**హుస్నాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త :** పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు మంగళవారం పాఠశాల ప్రిన్సి పాల్ బుర్ర రాజేందర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి వ్యవసాయ పర్యటనలో భాగంగా వరినాట్లు,పత్తిసాగు,వేరుషనగ సాగు,మక్కజొన్న,డ్రాగన్‌ఫ్రూట్స్ పంటను పందర్శించారు.ఈ సందర్భంగా సాగువిధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు తినే ఆహారం ఎలా తయారవుతుందని,విద్యార్థుల తల్లితండ్రుల కష్టం విలువలను తెలియజేసేందుకు వారిని ఈ పర్యటనకు తీసుకురావడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లి శైలేందర్,ఉపాధ్యాయులు శ్రీనివాస్,ప్రకాష్,గాయత్రి,వంశీ,రజితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**రాయపోల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** తల్లిదండ్రులు లేని అనాద పిల్లలకు ప్రభుత్వమే అన్ని తానై విద్యా ఉపాధి అవకాశలు కల్పిస్తుందని జిల్లా పరిరక్షణ అధికారి బూరుగుపల్లి రాజు అన్నారు.మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో ఇటీవల మూడు రోజుల వ్యవధిలో తల్లి, కొడుకు మృతి చెందగా వారి కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మూడు రోజుల వ్యవధిలోనే కొప్పు సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందగా ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆయన తల్లి కొప్పు రామవ్వ గుండెపోటుతోటే మరణించడం బాధకరం అని సత్యనారాయణకు భార్య హేమలత ముగ్గురు కూతుర్లు మౌనిక, అశ్విత, రమ్య ఉన్నారన్నారు. వీరిలో మౌనిక ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఆర్థిక సమస్యలతో చదువు మనేసిందన్నారు.అశ్విత బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతుందన్నారు. రమ్య ములుగు మండలంలోని గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదవుతుందని తెలిపారు.వీరి ముగ్గురు చదువులను వచ్చే సంవత్సరం నుండి ప్రభుత్వమే చదివిస్తుందని, విద్యా వసతులు కల్పించి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. వీరిని సోమవారం జిల్లా బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరచడం జరుగుతుందన్నారు.

## నిధులు మంజూరు చేయడంపట్ల హర్షం

**తొగుట, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** దుబ్బాక నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో గ్రామ పంచాయతీ భవనాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించేందుకు నియోజకవర్గంలో 25 గ్రామాలలో రూ.20 లక్షల చొప్పున రూ.5 కోట్ల నిధులు ఎంపి ప్రభాకర్‌రెడ్డి మంజూరు చేయడం పట్ల వైస్ ఎంపిపి బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు దృష్టిలో పెట్టుకొని పరిష్కారాని ఎంపి కృషి చేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ పంచాయతీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీలకు పక్క భవనాలు లేక అద్దె భవనాలలో అవస్థలు పడుతున్న పంచాయతీ పాలక వర్గం ఇబ్బందులు త్వరలోనే తీరుతాయన్నారు. నిధులు మంజూరు చేసిన సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు, ఎంపి ప్రభాకర్‌రెడ్డిలకు అయన కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ నియామకాల్లో లాంగ్‌జంప్‌ను తగ్గించాలి

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 20 ప్రభాతవార్త:**

తెలంగాణ పోలీస్ నియామకాల్లో లాంగ్‌జంప్ 3.8 మీటర్ల నుండి 4 మీటర్లకు పొడిగించడం పట్ల తెలంగాణ నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన యువజన కాంగ్రెస్ ఈ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండిస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మకొండ దయాసాగర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మెదక్ డీఎస్పీ సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే నిరుద్యోగులను ఆసరాగా చేసుకొని కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి అందులో నానా రకాల కండీషన్లు పెడుతూ ఈ ప్రభుత్వం నిరుద్యోగుల ఉసురు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షులు ప్రేమ్, అసెంబ్లీ అధ్యక్షులు రమేష్‌గౌడ్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మన్సూర్, ఘనపూర్ మండల అధ్యక్షులు ఆదిల్ పాషా తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

## విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

**మిరుదొడ్డి, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అంకం జశ్వంత్ పూర్వ విద్యార్థి ఐఐటి సీటు సాధించినందుకు విద్యార్థి తల్లిదండ్రులు అంకం రమ శ్రీనివాస్ దంపతులు పాఠశాలవిద్యార్థులకు మంగళవారం టై, బెల్టు, గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ జె.ప్రభుదాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ పెద్ది కవితరాజు, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ, జనార్ధన్, విశ్వరూపం, అమరేందర్‌రెడ్డి, రాణి తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General public hereby informed that **Sri. MURADI BALAKRISHNA S/o Sri. MURADI ASHOK,** aged about 31 years, Occ: Business, R/o. H.No.3-19, Kokkonda Village, Mulugu Mandal, Siddipet District, Telangana State, has approached the Malkajgiri Branch, Shriram Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **Sri. MURADI BALAKRISHNA** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that the H.No.3-19, admeasuring 605 Sq.yds., in Survey No.492/10, Situated at Kokkonda Village and Grampanchayath, Mulugu Mandal, Siddipet District, Regn. Sub-Dist: Gajwel, Telangana State and Bounded by: North: House of Muradi Narayana, South: House of Gundla Raju, East: House of Darshanam & 10' Road, West: House of Muradi Rajaiah.

**Sd/- P. SRINIVASA RAO**
**Advocate**
Flat No.A-14, Ground Floor, Srinivasa Heights Apts, Adarshnagar, Uppal, Hyderabad-39. Cell: **9346666438**



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

## కొమరవెల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**సిర్గాపూర్, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కొమరవెల్లి మల్లన్న దేవస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంజీవ్‌పాటిల్, ఖేడ్ మండల పార్టీ ఉపాధ్యక్షులు జుర్రు నర్సింలు యాదవ్, గ్రామ అధ్యక్షులు యాదవరావుపాటిల్, యాదవ సంఘం అధ్యక్షులు గ్రామస్థులు శంకర్, బుచ్చన్న, వెంకన్న, సాయిలు, రాములు, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రవికుమార్ పాల్గొన్నారు.

### పంచాయతి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు...

**సంగారెడ్డి, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నూతనంగా గ్రామపంచాయతీ భవనాలు నిర్మించుకునేందుకు ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 57 గ్రామ పంచాయతీలకు గాను రూ.11.40 కోట్లు మంజూరయ్యాయన్నారు.

## అమ్మవారి నామస్మరణతో మార్మోగిన నాదులపూర్



ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**జోగిపేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:** మండలంలోని నాదులపూర్ గ్రామం మంగళవారం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. రేణుకా ఎల్లమ్మ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో సందడి నెలకొంది. గ్రామం నుంచి వలస వెళ్లినవారు, అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు పిల్లాపాపలతో గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. వార్షికోత్సవ ఉత్సవాలకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు నారాయణ, లింగన్న, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రారంభించారు.

## ఆర్టీసీలో ప్రయాణిద్దాం-ప్రైవేటుకు దూరంగా ఉందాం

### -బెల్లాపూర్ చౌరస్తాలో కళాబృందం ప్రదర్శన



ఆర్టీసిపై కళాబృంధం అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి డిసెంబరు 20, ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని, ప్రమాదకరంగా ఉన్న ప్రైవేటు వాహనాలు (ఆటోలు, జీపులు)లకు దూరంగా ఉండాలని ఆర్టీసీ కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. మంగళవారం మనూర్ మండలంలోని బెల్లాపూర్ చౌరస్తాలో టిఎస్‌ఆర్‌టిసి కళాజాతబృందం సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఉద్దేశించి డిప్యూటీరిజినల్ మేనేజర్ దైవదినం , డిపో మేనేజర్ మల్లేషయ్య మాట్లాడుతూ ఆర్టీసి ఏర్పడి 90 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. సంస్థ చైర్మన్ బాజిరెడిన గోవర్ధన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్‌ల పర్యవేక్షణలో ఆర్టీసి ప్రయాణికులకు పలు సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రజల వద్దకు ఆర్టీసి కార్యక్రమంలో ప్రజలు ఆర్టీసిలోనే ప్రయాణించాలన్న ఆలోచనలు రేకెత్తిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ డిపో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సేఫ్టీ డ్రైవర్ భాస్కర్, మార్కెటింగ్ ఇంచార్జి మారుతి, స్టేషన్ మాస్టర్ పాండు, సూర్యకాంత్, సెక్యూరిటీ నర్సింలు, యాదయ్యచ, ప్రజలు పాల్గొన్నారు.

## క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే



మైనార్టీ గురుకుల విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**సంగారెడ్డి, డిసెంబరు 20, ప్రభాతవార్త:** 18వ జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికై క్రీడాకారులను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సన్మానించి అభినందించారు. జహీరాబాద్ మండలంలోని అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎల్ పవన్‌కిరన్, షేఖ్ సదిక్‌హుస్సేన్‌లు పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను సన్మానించి పోటీల్లో ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకమిటి చైర్మన్ పెంటారెడ్డి, పట్టణ బిఆర్‌ఎస్ అధ్యక్షులు సయ్యద్ మోహివుద్దీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపిపి అధ్యక్షులు విజయ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ జె రాములు, కేయస్ జమీల్, పీఈటిలు అనిల్‌కుమార్, ఎండి ఖాసీం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేశవనాథ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

**అల్లాదుర్గం డిసెంబర్ 20, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా మండల కేంద్రమైన అల్లాదుర్గం పట్టణ శివారులోని ప్రసిద్ధిచెందిన అతిపురతనమైన కేశనాథ గుట్టపై వెలిసన శివకేశవ దేవాలయాన్ని టెలికమ్ అడ్వైజర్ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ డి కాశీనాథ్ మంగళవారం నాడు దర్శించుకొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహాయంగా 1 లక్ష 1 వేయి నూట పదహారు రూపాయల చెక్కును విరాళంగా ఆయల పూజారి శిలంకోట ప్రవీణ్ శర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పలువట్ల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



కేశవనాథ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీపీ డి కాశీనాథ్

# జహీరాబాద్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**సంగారెడ్డి డిసెంబరు 20, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పండగలను ప్రజలతో కలిసి ఆనందోత్సవాలతో జరుపుకునేలా ప్రణాళికలను రూపొందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, డిఆర్‌ఎస్ నాయకులు మల్కాపురం శివకుమార్, ఉమాకాంత్ పాటిల్, పెంటారెడ్డి, అంజమ్మ, బోడ స్వప్న, బోడ భాస్కర్, మోహన్ రెడ్డి, గుండప్ప, మంకాల్‌సుభాష్, అల్లాడి నర్సింలు, రామకృష్ణరెడ్డి, మహమ్మద్ తంజీమ్, మాణెమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు జాదవ్, ఎంజి రాములు యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింలుపాటిల్, విజేందర్ రెడ్డి, కుతుబుద్దీన్, సుభాష్‌రెడ్డి, మహమ్మద్ తన్వీర్, మిథున్‌రాజ్, ఇజ్రాయిల్‌బాబి, యండి యూనిస్, మోతీరాం, రాములు నేత, జైరాజ్, కాశీనాథ్, జిల్లా అధికారి కెఎల్ జాన్‌వెస్లీ, ఇండిపెండెంట్ పాస్టర్లు, ఆర్‌డిఓ రామేశ్‌బాబు, తహసీల్దార్‌లు, ఎంపిడిఓలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కానులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఏపీజీవీబీ రీజనల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్యం

## టెంపరరీ మెసెంజర్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** ఏపీజీవీబీ బ్యాంక్‌లో పనిచేస్తున్న టెంపరరీ మెసెంజర్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కోర్టు తీర్పును అమలు చేయాలని సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్యం డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీజీవీబీ బ్యాంక్‌లో పనిచేస్తున్న టెంపర్ వరి మెసెంజర్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం సంగారెడ్డి లోని రీజనల్ కార్యాలయం ముందు బైఠాయించి పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. చైర్మన్ బయటకు వచ్చి డిమాండ్ల పరిష్కారినికి హామీ ఇవ్వాలని నినాదాలు చేశారు. గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని పర్మనెంట్ చేయాలని కోర్టుకు పోవడంతో యాజమాన్యం తీవ్రంగా వేధింపులకు పాల్పడుతునందని అన్నారు. బ్యాంక్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ తో చర్యలు జరుపగా డిసెంబర్ 23 సుప్రీంకోర్టులో కేసు ఉన్నదని అప్పటివరకు ఎవర్ని కొత్తగా రిక్రూట్ చేయమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మోహన్‌దాస్, ఉద్యోగులు ఆంజనేయులు, శ్రీనివాస్, రాజు, నరేందర్, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సహకార ఉద్యోగులు

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని సహకార సంఘాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ జీవో జారీచేసినందుకు గాను సహకార ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం నాడు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి సహకార సంఘాల (టీఆర్ఎస్‌కేవీ) రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌సింగ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసినట్లు సంఘ మెదక్ జిల్లా అధ్యక్షుడు, రామాయంపేట సహకార సంఘం సీఈవో పుట్టి నర్సింలు (గజ్జెల్) తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 44 ద్వారా సహకార సంఘాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడం హర్షదాయకమన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్‌కు ఋణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ సీఈవో, సంఘం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, టేక్మాల్ సీఈవో వేణు, పాపన్నపేట సీఈవో నవీన్, రంగంపేట సీఈవో నవీన్, ఇబ్రహీంపూర్ సీఈవో శ్రీనివాస్, రెడ్డిపల్లి సీఈవో నరేష్, సోమక్కపేట సీఈవో పోచయ్య, రామాయంపేట సెక్రటరి శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని పలు సహకార సంఘాల సీఈవోలు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ధనుర్మాస ఉత్సవాలకు రావలసిందిగా ఎమ్మెల్యేకు ఆహ్వానం

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్20 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా జరిగే ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జనవరి 2వ తేదీన సోమవారం రోజున జరిగే వైకుంఠ ఏకాదశి కార్యక్రమానికి, జనవరి 12వ తేదీ రోజున జరిగే శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి సకుటుంబ సమేతంగా వెంకటేశ్వర దేవాలయానికి రావలసిందిగా కోరుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ తరపున మంగళవారం ఆహ్వాన పత్రికను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ కంచి మధుసూదన్, కమిటీ సభ్యులు లయన్ నాగరాజు, సభ్యులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం



రామాయంపేట రెవెన్యూ డివిజన్‌కు మద్దతు తెలుపుతున్న నాయకులు

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు రజకసంఘం ఏకగ్రీవ తీర్మానం

**రామాయంపేట, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** రామాయంపేట మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రజక సంఘం నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. రామాయంపేట పట్టణంలో సమావేశమైన రజక సంఘం నాయకులు ఈనిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకుడు కోనాపురం వెంకటి (వైఎస్) మాట్లాడుతూ గతంలో 183 రోజులపాటు కుల సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని, మంత్రి హరీష్‌రావు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమాన్ని విరమించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన డివిజన్లు ఏర్పాటు చేసినా, రామాయంపేట ఏర్పాటు కాకపోవడంతో మలి విడత ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి



క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

**నిజాంపేట, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలోని తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత, ఇఫ్కోడైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ఎంపిపి సిద్దరాములు, సర్పంచ్ కవిత ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం నూతనంగా మంజూరైన రోడ్డు వెడల్పు గురించి గ్రామంలో గ్రామస్థులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు వెడల్పులో ఇల్లు కోల్పోతున్న బాధితుల కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకొని, వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగరాజు, తహశీల్దార్ గంగాప్రసాద్, ఎంపీడివో వెంకటలక్ష్మి, పంచాయతీ రాజ్ డీఈ పాండు రంగారెడ్డి, ఏఈ విజయ్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి, ఆర్ అండ్ బి అధికారులు వెంకటేశం, విజయసారథి, రామాయంపేట, నిజాంపేట సొసైటీ చైర్మెన్‌లు బాదె చంద్రం, బాపురెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అమరసేనారెడ్డి, ఎంపిటీసీ బాల్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గౌస్, అబ్దుల్ అజీజ్, మావురం రాజు, సంగుస్వామి, దుబ్బరాజ్‌గౌడ్, వెంకటస్వామి గౌడ్, పంగ రాజు, మోహన్‌రెడ్డి, సంతోష్ కుమార్‌గౌడ్, విజయ్, నగేష్, ఎల్లం, నాగరాజు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నిమతాలను సమానంగా గౌరవిస్తున్న ప్రభుత్వం

### ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి

**నర్సాపూర్, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం క్రిస్మస్ పండగను పురస్కరించుకొని నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో క్రైస్తవులకు ప్రభుత్వం మంజూరు చేసిన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ క్రిస్మస్ పండగను ఘనంగా జరుపుకోవాలన్నారు. అనంతరం క్రిస్టియన్స్ ఫాస్టర్స్‌ల ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఫైడి శ్రీధర్‌గుప్త శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదేవిదంగా వారు 2023 నూతన క్యాలండర్ ను ఆవిష్కరించారు.

### కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

బిఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు మంజూరు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సిహెచ్ మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, ఆర్డీఓ సాయిరామ్, ఎంపిపి లు జ్యోతిసురేశ్‌నాయక్, హరికృష్ణ, పిఏ సిఎస్ చైర్మన్ రాజుయాదవ్, బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఫైడి శ్రీధర్‌గుప్త, మండల తహాశీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శరీఫ్, బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, నాయకులు కుమ్మరి నాగేశ్, కృపాచారి, పాస్టర్లు లక్ష్మణ్, సాగర్, ప్రభాకర్, ఎంపిటిసీలు. సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

# మిరపపంటలను పరిశీలించిన అధికారులు

**జోగిపేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:** రైతులు సాగు చేస్తున్న మిరప పంటకు తెగులు సోకినట్లు గుర్తించిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు తెగుళ్ల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మంగళవారం అందోల్‌మండలంలోని అల్మాయిపేట, అన్నసాగర్ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మిరప పంటలను మండల వ్యవసాయాధికారి విజయరత్న, ఉద్యాన అధికారి కీర్తి కృష్ణ,ఏఇఓ అనిత, లక్ష్మీకాంత్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మిరప పంటకు కాయతొలచు పురుగుల, వైరస్ సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆకులు, పూతపై చిన్న చిన్న పేను వంటి పురుగులు ఉంటే తామర పురుగు సోకినట్లు గుర్తించాలని, తెగులు నివారణకు స్పైనోటోరియ 1మిల్లీ లీటరును 1లీటరు నీటిలో కలపాలని, లేదా సయాన్ట్రీనిప్రోలు 1.25 మిల్లీలీటర్లు 1 లీటరు నీటిలో కలుపుకోవాలని, లేదా డైపెన్ట్రాస్ 1.25 గ్రామ్స్‌ను 1 లీటరు నీటికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 4 గ్రాములను 10లీటర్ల నీటలో కలుపుకుని మొక్కలపై పిచికారి చేసుకోవాలన్నారు. ఎకరానికి 20 నుంచి 25 పసుపు, నీలిరంగు జిగురు అట్టలని పంట కన్నా కొంచెం ఎత్తులో కర్రల సహాయంతో ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంట కాలంలో రైతులు కట్టెలను రెండు మార్లుమార్చుకోవాల్సి ఉంటుందన్నారు. మిరప పంటను నాటుకునే పక్షం రోజుల ముందు పంటను సాగు చేసే పొలానికి చుట్టూ సరిహద్దు మొక్కలుగా జొన్న, సజ్జ, మొక్కజొన్న పంటలను నాలుగైదు వరుసల్లో నాటుకోవాలన్నారు. విధిగా విత్తన శుద్ది చేసుకుని పంటలను నాటుకోవాలని, ఫలితంగా తెగులు సోకే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. ఎరువులను సకాలంలో తగిన మోతాదులో వినియోగించుకోవాలని సూచించారు. అధిక దిగుబడులు సాధించేందుకు సేంద్రీయ పద్దతిలో పంటలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు దుర్గయ్య, మల్లేశం, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



మిరప పంటపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

## వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడి పొందండి

### జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు

**న్యాల్‌కల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.నరసింహారావు సూచించారు. మంగళవారం బసంత్‌పూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పుచ్చకాయ, చెరుకు, కుసుమపంటలను మండల వ్యవసాయాధికారి ఎన్.లావణ్య, రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలను అధికారులకు వివరిస్తూ అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అడగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు రైతులకు పలు సూచనలు చేశారు. తెగుళ్ల, చీడపీడల నివారణకు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులు పొందడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్ లావణ్య, ఏఇఓ అజ్మత్ పాషా, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, ఇస్మాయిల్, అబ్బాస్ అలీ, తుక్కారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

## నల్లవాగు గురుకులంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

**సిర్గాపూర్, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవాగు గురుకులంలో పాఠశాల విద్యార్థులకు డాక్టరు నిఖిత ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరమైన ఏమైన సమస్యలు ఉంటే వెంటనే డాక్టరును సంప్రదించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో శేరికర్ కృష్ణవేణి, అనం, రాంచందర్, ప్రిన్సిపాల్ పాండునాయక్, శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

## నేడు నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశం

**సంగారెడ్డి, డిసెంబరు 20, ప్రభాతవార్త:** ఈనెల 21వ తేదీన నాగల్‌గిద్ద మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ షాజలోద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షులు మోతిబాయిరాథోడ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు. ఆయా గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు విధిగా సమావేశానికి హాజరై గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపిడిఓ షాజలోద్దీన్ వివరించారు.

## మానసిక ఉల్లాసంతో మేధాశక్తి మెరుగు : ఏపిఎం కుమార్

**న్యాల్‌కల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** చిన్నారులు మానసిక ఉల్లాసంగా రోజులు గడిపితే మేధాశక్తి పెరుగుతుందని ఇందిరా క్రాంతి పథకం ఏపిఎం కుమార్ అన్నారు. న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో పిల్లల ఎంపిక, సంరక్షణ, కుటుంబ, సంఘానికి సాధికారతపై పంచాయతీ కార్యదర్శులకు, అంగన్‌వాడి టీచర్లకు, గ్రామ సంఘం సభ్యులకు, విఓఎ, సిసిలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల నుంచి డెలవరీ వరకు, శిశుజాత2 నుంచి 6 సంవత్సరాల వరకు పిల్లలకు ఆట, పాటలతో కూడిన విన్యాసాలు, మానసిక ఉల్లాసం కల్గించే కార్య క్రమాలతో చిన్నారుల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. గ్రామాల వారిగా 6 మాసాలకు ఒకమారు కుటుంబ మేళా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## కళాశాలలో వృథాగా పడివున్న నీటి శుద్ధి పరికరం



అల్లాదుర్గం కళాశాలలో వృథాగా ఉన్న మంచినీటి శుద్ధిపరికరం

**అల్లాదుర్గం, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా మండల కేంద్రమైన అల్లాదుర్గం కళాశాలలో మంచినీటి శుద్ధిపరికరాన్ని అమర్చి, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని అల్లాదుర్గం నియోజకవర్గ సాధన కమిటీ అధ్యక్షులు బ్రహ్మం తెలిపారు. కళశాలలో సమస్యలు పరిశీలించగా నూతన మంచినీటి శుద్ధిపరికరం ఉన్న అమర్చకపోవడంతో లక్షల రూపాయల విలువగల పరికరాన్ని నిరూపయోగంగా, నిర్లక్ష్యంగా మూలకు పడివేసిన సంబంధిత కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులు ఆర్వో ప్లాంట్‌ను విద్యార్థులకు రోగాల భారీన పడకుండా శుద్ధమైన నీటిని అందించేందుకు గాను లక్షల రూపాయలు ఖర్చుచేస్తే అధికారుల నిర్లక్ష్యంవలన శుద్ధమైన నీటిని విద్యార్థులకు అందించలేకపోతున్నారని ఆయన విమర్శించారు. ఇట్టి పరికరాన్ని కళాశాలలో వెంటనే అమర్చి, విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని ఆయన అధికారులకు కోరారు. ఇప్పటికి కళాశాలలో కొంత వరకు వరండాల్లో విద్యార్థులు ఉదయం వేళాలో ప్రార్ధన చేయి ఖాలీస్థలంలో ఫ్లోరింగ్ చేయకపోవడం వలన పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా నాణ్యతలోపంతో డ్రైనేజ్ పైప్‌లైన్ లీకవుతోందని, దీనివలన విద్యార్థులు దుర్వసన వస్తుందన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి, సమస్యను పరిష్కరించేందుకు గాను వినతిపత్రం అందజేయనున్నట్లు బ్రహ్మం తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామప్రజలు కంది షరీఫ్, కిష్టయ్య, సంగయ్య, నర్సింలు, బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**గుమ్మడిదల, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** గుమ్మడిదల గ్రామానికి చెందిన పున్నాల సాయిరెడ్డి అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. స్థానిక బిఆర్‌ఎస్ పార్టీ నాయకుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సానుభూతి తెలియజేస్తూ స్పందించి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి ద్వారా ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నరసింహారెడ్డి, వార్డ్ సభ్యులు బండాల భాస్కర్, ఆకుల సత్యనారాయణ, బిఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఆంజనేయులు యాదవ్, నాయకులు అంబరాములు, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండి గౌస్, కొత్తల కృష్ణ, కుంటి పెంటయ్య పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందించిన సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్

**గుమ్మడిదల, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన షేక్ ఆసీఫ్ ఆక్సిడెంట్ అయ్యి హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నందున వారి ఆర్థిక పరిస్థితి బాగులేదు అని గమనించిన సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్ తన స్వంత డబ్బులు ఐదువేల రూపాయల ఆర్థిక సాయం షేక్ ఆసీఫ్, తండ్రి అక్బర్, మాజీ ఎంపీటీసీ అభిశెట్టి నారాయణ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పాలక వర్గ సభ్యులు నవీన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, అహ్మద్, ఇస్మాయిల్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నఘనపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**కొల్చారం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నఘనపూర్ గ్రామపంచాయతీలో మంగళవారం హైదరాబాద్ సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించామని, శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారికి మల్లారెడ్డి హాస్పిటల్‌లో ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి బొబ్బిలి ఇందిర ప్రియదర్శిని సందీప్, డాక్టర్ రవితేజ, మల్లారెడ్డి హాస్పిటల్ వైద్య సిబ్బంది, గ్రామకార్యదర్శి హేమంత్, పాల్గొన్నారు.